

నడిగూడెం మండలం కాగిత రామచంద్రాపురం వద్ద సాగర్ కాల్వకు పడిన గండిని పరిశీలిస్తున్న మాజీ మంత్రులు హరీశ్‌రావు. జగదీశ్‌రెడ్డి, సబితారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి, కంచర్ల, బొల్లం తదితరులు


నమస్తే తెలంగాణ

యాదాద్రి భువనగిరి

I | హైదరాబాద్, బుధవారం 4 సెప్టెంబర్ 2024 | YADADRI BHUVANAGIRI


# పొలాలు చూడండి సారూ..

మోటార్లు పోయినయ్... పొలం మునిగింది

ఇండ్లల్లోకి నీళ్లు రాంగనే తాళాలేసి బైటకొచ్చినం

# ఇసుక మేటలెట్లున్నయో...

## ఎండాకాలంలో గేట్లకు వెల్డింగ్ చేసి సీల్ చేసిండ్రు

## అందుకు తూములు తీద్దామంటే ఎల్లలేదు

**బీఆర్ఎస్ బృందంతో సాగర్ ఎడమ కాల్వ గండ్ల బాధితుల ఆక్రందన**

**ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఇక్కడికొచ్చినం : మాజీ మంత్రి హరీశ్‌రావు**

**ప్రభుత్వ బాధ్యతారాహిత్యం వల్లే నష్టం : మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి**

**నడిగూడెం మండలంలో ఎడమ కాల్వ గండ్లను పరిశీలించిన బీఆర్ఎస్ నేతలు**

నల్లగొండ ప్రతినిధి, సెప్టెంబర్3(నమస్తే తెలంగాణ) : నడిగూడెం మండలం పరిధిలో నాగార్జునసాగర్ ఎడమకాల్వ కట్టకు గండ్లు పడిన ప్రాంతంలోని రైతుల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఇన్నేండ్లు తమ జీవితాలకే ఆదరువుగా నిలిచిన కాల్వ కట్ట కండ్ల ముందే తెగిపోతున్నా ఏమీ చేయాలని నిస్సహాయస్థితిలో చూస్తుండి పోయారు. కాల్వ కట్ట తెగడమే కాదూ ఆ నీరంతా ఉగ్రరూపం దాల్చుతూ క్షణాల్లో తమ పంట పొలాలను ముంచెత్తుతున్నా కాపాడుకోలేక పోయారు. ఇలా జీవనాధారమైన పంటపొలాలను కోల్పోయి తీవ్ర దుఃఖంలో ఉన్న రైతులు బీఆర్ఎస్ బృందం ఎదుట తమ గోడును వెళ్లబోసుకున్నారు. మంగళవారం మాజీ మంత్రులు టి.హరీశ్‌రావు, జి.జగదీశ్‌రెడ్డి, పి.సబితాఇంద్రారెడ్డితో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలంతా కలిసి వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. సూర్యాపేట జిల్లా నడిగూడెం మండల రామచంద్రాపురం పరిధిలో నాగార్జునసాగర్ ఎడమ కాల్వకు ఆదివారం ఉదయం గండ్లు పడిన విషయం తెలిసిందే. ఎడమ కాల్వకు గండ్లు పడిన ప్రాంతాన్ని పరిశీలించి, జరిగిన నష్టాన్ని, వాస్తవ పరిస్థితులను బాధిత రైతులను హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, సబితాఇంద్రారెడ్డి అడిగి తెలుసుకున్నారు. హరీశ్‌రావు తదితరులు వస్తున్న విషయం తెలిసిన బాధిత రైతులు పెద్ద సంఖ్యలో కాల్వ కట్టపైకి తరలివచ్చారు. కాల్వ కట్టపైకి చేరుకున్న నేతలను చూడగానే రైతులు ఎదురెళ్లి తమ గోడును వెళ్లబోసుకున్నారు. అసలు కట్ట తెగడానికి కూడా ఈ సర్కారులోని మంత్రులే కారణమని రైతులు తమ ఆవేదనను చెప్పుకొచ్చారు. కాల్వ కట్ట తెగిన ప్రాంతంలో పొలం కొట్టుకుపోయిన బాధిత రైతు నీలకంఠ వెంకటేశ్వర్లు ముందుగా జరిగిన ఘటనను పూసగుచ్చినట్లు వివరించారు. ఎండాకాలంలో ఖమ్మం నీళ్లు తీసుకుపోయేందుకు ఎస్కేప్ ఛానళ్లకు వెల్డింగ్ టాకాలు వేయడం వల్లనే తూములు ఎత్తలేకపోయామని చెప్పారు. '2024 ఏప్రిల్ 12న ఖమ్మం మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉన్న ఫలంగా వీఆర్ఏలు, ఫీల్డ్ అసిసెంట్లు, పోలీసోళ్లను ఒక్కో తూముకు నలుగురిని పెట్టి నీళ్లు తీసుకుపోయారు. అప్పుడే వెల్డింగ్‌లు పెట్టి సీల్ చేశారు. తర్వాత వీటిని తొలిగించకుండానే ఇప్పుడు నీళ్లు వదిలారు. మొన్న వచ్చిన వరదకు సాగర్ నుంచి వచ్చే కాల్వ నీళ్లు.... వాటికి పాలేరు నుంచి కాల్వలోకి ఎదురెక్కిన వరద నీళ్లు కలిపి కాల్వకు ముప్పు తెచ్చాయి. ఇది జరుగుతుంటే ఎస్కేప్ ఛానళ్ల తూములను ఎత్తుదామంటే వెల్డింగ్ చేయడం తో అవి రాలేదు. అధికారులు కూడా ఏమీ చేయలేకపోయారు. దాంతో చూస్తుండగానే కా ల్వ కట్ట మీద నుంచి నీళ్లు పొంగిపొర్లుతూ రెం డు చోట్ల కట్ట తెగిపోయింది' అని వివరించారు. ఇక అక్కడే పెద్ద ఎత్తున గుమికూడిన మహిళా రైతులు హరీశ్‌రావు వద్దకు వచ్చి తమ పొలాల్లో ఇసుక మేటలను చూడాలంటూ తొడ్కోని వెళ్లారు. కాల్వకట్ట మీద నుంచి కనుచూపు మేరలో వరద నీరు, ఆ నీటి కింద ఇసుక మేటలే పొలాలను కమ్ముకుని ఉన్నాయి.



నడిగూడెం మండలం కాగిత రామచంద్రాపురం వద్ద గండి పడి నష్టపోయిన రైతులతో మాట్లాడుతున్న మాజీ మంత్రులు హరీశ్‌రావు. జగదీశ్‌రెడ్డి, సబితారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

### సర్కార్‌పై ఒత్తిడి తెచ్చేందుకే : హరీశ్‌రావు, మాజీ మంత్రి.

బాధిత రైతులు, గోడు విన్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పందిస్తూ 'అమ్మా మేము... కేసీఆర్ తోలిస్తే బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలం అందరం వచ్చాం. వాస్తవ పరిస్థితిని చూసి అంచనా వేసేందుకు వచ్చాం... మీరు చెప్పిన మాటలన్నీ విన్నాం. ఇసుక మేటలు వేస్తే ఆ పొలం మళ్లీ పనికిరాదు. దాన్ని బాగు చేయాలంటే చాలా కష్టం. నష్టపోయిన వరి పొలాలకు ఎకరాకు కనీసం రూ.30వేల పరిహారం, ఇసుక మేటలు వేసిన పొలాలకు కనీసం రూ.50వేలు ఇవ్వాలని ప్రభుత్వం మీద ఒత్తిడి తెస్తాం. అసెంబ్లీలో మాట్లాడుతం. మీ అందరికీ మేలు జరిగేలా మా వంతు సహకారం ఉంటది. మీరు ధైర్యంగా ఉండాలి.' అని హరీశ్‌రావు బాధిత రైతులకు భరోసా కల్పించారు.

### ప్రభుత్వం నిర్లక్ష్యమే కారణం : మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

కాల్వ గండ్లు ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే జరిగాయని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. దురదుష్టవశాత్తు ప్రకృతి విపత్తు వల్లనే నష్టం జరిగి ఉంటే ఇలాంటి ఆపత్కాలంలో ప్రభుత్వంపై విమర్శలు చేయాల్సిన అవసరం గానీ, రాజకీయాలు చేయాల్సిన అవసరం గానీ లేదని తమకు లేదని స్పష్టం చేశారు. గత పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం కాలంలో ఇలాంటివి ఎన్నో ఎదుర్కొన్న వాళ్లమన్నారు. కానీ ఆశ్చర్యంగా ప్రజలకు ధైర్యం చెప్పాల్సిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరదల్లో ప్రజలు కొట్టుకుపోతుంటే రెండు రోజుల వరకు పత్తా లేడని ఆరోపించారు. వరద ప్రాంతాన్ని చూడడానికి, ప్రజలకు ధైర్యం చెప్పేందుకు ఎందుకు సీఎం, మంత్రులు రాలేదని ప్రశ్నించారు. ఖమ్మం పట్టణం కొట్టుకుపోడానికి ప్రజలు చచ్చిపోవడానికి ప్రభుత్వమే కారణమని, ఇది బాధ్యతారహిత్యంతో మాట్లాడడం లేదని, తొమ్మిది గంటలు సాయం కోసం కండ్ల ముందు ఎదురు చూస్తుంటే కూడా కనీసం ఒక్క హెలికాప్టర్ కోసం ప్రయత్నం చేయలేదు అని జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. ప్రజల్లో తిరుగుబాటు మొదలయ్యాక మొసలి కన్నీరు కారుస్తూ... రంగంలోకి దిగింది నిజం కాదా అని ప్రశ్నించారు. హెలికాప్టర్ సమకూర్చాల్సిన సీఎం ఏమయ్యాడన ప్రశ్నిస్తూ... వరదల్లోని ప్రజలను గాలికి వదిలేసి సీఎం, మంత్రులు జల్సాల్లో ఉన్నారని విమర్శించారు. ఇంకా వీరితో పాటు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, వివేకానందగౌడ్, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యాయాదవ్, స్థానిక మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యాయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్ కుమార్, చిరుమర్తి లింగయ్య, కంచర్ల భూపాల్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర నేతలు ఎర్రోళ్ల శ్రీనివాస్, గోపగాని వెంకటనారాయణగౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు పల్లా నర్సిరెడ్డి, ఈదయ్య, భోనగిరి ఉపేందర్, తదితరులు ఉన్నారు.

### అధికారులు చూసి పోయారు తప్ప పట్టించుకోలే..

కాల్వకట్టపై మహిళలంతా ఒక్కసారి తమ గోడును ఆవేదనను వెళ్లబోసుకున్నారు. పిచ్చమ్మ అనే మహిళ కాల్వ తెగిన పరిస్థితిని వివరిస్తూ... 'ఉదయం 6గంటలకు పొలాలకు వద్దకు మా సార్ వెళ్లిండు... కాల్వ ఫుల్ వస్తుందని, కాల్వకు వేసిన మోటార్లు తీసేద్దామనికి తాడు కోసం ఇంటికొచ్చిండు. ఇంటి కాడ తాడు తీసుకుని వాళ్ల నాన్న కూడా వెంట పెట్టుకుని కాల్వకట్ట మీదకు పోయిండు. అప్పటికే మోటార్లు మునిగిపోయినయ్. కాల్వ ఫుల్ వస్తుంది... పొంగిపొర్లుతున్నది... ఇక మన వల్ల కాదులే అని కాల్వ తెగుద్దేమో అని ఇంటికొచ్చాడు. అప్పుడే ఒక ఆఫీరమ్మ వచ్చింది.. కానీ ఆమె తూములు లేపుకుంటూ గేట్లు ఎత్తుకుంటూ వస్తే బాగుండేది. ఆ నీళ్లు వెళ్లిపోయేది... కాల్వ తెగకపోయేది. ఏమీ చేయకపోనూ.. తన చెప్పులకు అంటిన బురదను కాల్వ నీళ్లతోనే కడుక్కుని వెళ్లింది. ఆమె అలా వెళ్లిందో లేదో... కాల్వ తెగిపోయింది.' అని చెప్పింది. అక్కడే ఉన్న హారిక అనే మరో మహిళ స్పందిస్తూ 'కాల్వ తెగడంతో ముందు వరదనీళ్లు ఊరుమీద పడ్డయ్. ఇండ్లలోకి నీళ్లు రాగానే తాళాలు వేసుకుని కట్టుబట్టలతో బయటకొచ్చినం.. సగం ఊరు ను నీళ్లు చుట్టముట్టినయ్... ఆ తర్వా త కాల్వ పక్కనే ఉన్న ఇంకో కట్ట తెగడంతో పొలాల మీద పడ్డయ్' అని చెప్పుకొచ్చింది. 'కాల్వ కట్ట తెగడంతో మనిషిలోతు వరద పోయింది... పొలాలు పోతే పోయినవి గానీ ఇసుక మేటలు పెట్టాయి... మోటార్లు కొట్టుకుపోయాయి... పొలం ఇంకా వరద నీళ్లలోనే ఉంది.' అని మరో మహిళ సుగుణమ్మ చెప్పుకొచ్చింది. 'వరద ఎక్కువైనప్పుడు కాల్వ తూములు ఎత్తితే ఈ బాధే ఉండేది కాదూ... వీటిని సీల్ చేశారు. లాకులు తీద్దామంటూ వెళ్లలేదు. ఎండాకాలంలో వెల్డింగ్ చేశారు.. అందుకే ఎత్తలేకపోయామని మహిళలంతా తమ ఆవేదనను వ్యక్తం చేశారు.

# ఖమ్మంలో మాజీ మంత్రులపై దాడిపై బీఆర్ఎస్ నేతల ఖండన

### బీఆర్ఎస్‌కు మద్దతు పెరుగుతుందనే దాడి

ప్రజల నుంచి బీఆర్ఎస్‌కు పెరుగుతున్న ఆదరణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు అర్థమవుతున్నందునే ఖమ్మం జిల్లాలో పరామర్శించడానికి వెళ్లిన బీఆర్ఎస్ నాయకులపై దాడులకు దిగుతున్నారు. వరదతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే సాయం చేయడానికి రాని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు దాడులు చేసేందుకు మూకుమ్మడిగా వస్తున్నారు. ఇలాంటి చర్యలు ప్రజలు గమనిస్తున్నారు. రానున్న రోజుల్లో ప్రజలే బుద్ధి చెబుతారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై దాడి చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి.

**-బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎంపీ**

### పాలన చేతగాకనే డైవర్షన్ పాలిటిక్స్

పాలన తెలియకనో లేక చేతగాకనో కానీ ప్రజా సంక్షేమాన్ని పక్కన పెట్టిన కాంగ్రెస్ పార్టీపై ప్రజల నుంచి వ్యతిరేకత పెరుగుతుండడంతో బీఆర్ఎస్‌పై దాడులకు దిగుతూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నది. తుంగతుర్తిలో ఇటీవల శాంతియుతంగా ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ శిబిరంపై కాంగ్రెస్ గూండాలు దాడికి పాల్పడగా, మంగళవారం ఖమ్మంలో మాజీ మంత్రుల వాహనాలపై రాళ్లదాడి చేయడం కాంగ్రెస్ గూండాయిజానికి పరాకాష్ట. కాంగ్రెస్ పార్టీ అంటేనే మంచి చేయరు. ఇతరులను చేయనియ్యరనేది మరోసారి రుజువు చేసుకుంది. భారీ వర్షాలకు ఖమ్మంలో వేలాది కుటుంబాలు సర్వస్వం కోల్పోతే వారి బాధలను విని సాయం చేసేందుకు ఖమ్మం వెళ్లిన మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, సబితాఇంద్రారెడ్డి వాహనాలపై కాంగ్రెస్ గూండాలు దాడి చేయడం హేయమైన చర్య. ఇది కాంగ్రెస్ ప్రభుత్వం, రేవంత్‌రెడ్డి చేతగాని తనమే తప్ప ఇంకేం లేదు.

**-గాదరి కిశోర్‌కుమార్, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే**

### కాంగ్రెస్ చేసిది పాలన కాదు గూండాగిరి

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసేది పాలన కాదు గూండాగిరి. సిద్దిపేటలో హరీశ్‌రావుపై, సీఎం రేవంత్ సొంతూరులో మీడియాకు చెందిన మహిళా జర్నలిస్టులు, తుంగతుర్తిలో బీఆర్ఎస్ శిబిరంపై కాంగ్రెస్ దాడులు చేయగా నేడు ఖమ్మంలో బాధితులకు సాయం చేసేందుకు వెళ్లిన మాజీ మంత్రుల కార్లపై దాడులు చేశారు. ఇవి సిగ్గు చేటు. మనం ఏదీ చేయలేము. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేము కాబట్టి ప్రజలను డైవర్షన్ చేయాలని రేవంత్‌రెడ్డే తన ఎమ్మెల్యేలు, పార్టీ కేడర్‌కు శిక్షణ ఇస్తున్నట్లు అనుమాన పడాల్సి వస్తున్నది. ఇలాంటి పాలన ఎక్కువ కాలం చేయలేరు. ప్రజలే కాంగ్రెస్ ప్రభుత్వంపై దాడులకు దిగకముందే ఇచ్చిన హామీలు అమలు చేయాలి. వరద బాధితులకు పరిహారం తక్షణమే చెల్లించాలి.

**-చిరుమర్తి లింగయ్య, నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే**



తంగడపల్లి పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతు జెండగే

# పారిశుధ్య చర్యలు పక్కాగా చేపట్టాలి

- **కలెక్టర్ హనుమంత్ కె.జెండగే**

చౌటుప్పల్, సెప్టెంబర్ 3 : సీజనల్ వ్యాధుల నిర్మూలన కోసం పారిశుధ్య చర్యలు పక్కాగా చేపట్టాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే తెలిపారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపీ, మందుల స్టాక్‌ను పరిశీలించారు. సీజనల్ వాధ్యుల నివారణకు కోసం తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. అక్కడ నుంచి దామెర గ్రామంలో నిర్మిస్తున్న నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనులను కూడా పరిశీలించారు. సాధ్యమైనంత త్వరగా ఆరోగ్య కేంద్రం పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. తదుపరి చింతలగూడెం ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ అమ్మ ఆదర్శ కమిటీ ద్వారా చేపట్టిన పనులను పరిశీలించారు. విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. అంగన్‌వాడీ సెంటర్‌లో లబ్ధిదారులను సంఖ్యను ఆరాతీశారు. వారికి అందిస్తున్న పౌష్టికాహారాలను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటింటి జ్వరం సర్వే తప్పకుండా చేపట్టాలన్నారు. అవసరమైన చోట మెడికల్ క్యాంపులు పెట్టాలని సూచించారు. ఫీవర్ సర్వేలో గుర్తించిన వారిని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రక్త పరీక్ష చేసి దాని ప్రకారం వైద్య సహాయం అందించాలన్నారు. తగిన మందులతో సిద్ధంగా ఉండాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ ఎన్.వెంకటేశ్వర నాయక్, ఎంపీడీఓ ప్రమోద్‌కుమార్, మండల మెడికల్ ఆఫీసర్ సీహెచ్. కాటంరాజు, పంచాయతీరాజ్ ఇంజినీర్ నితీశ్ ఉన్నారు.

# పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలకు దరఖాస్తులు

యాదాద్రి భువనగిరి, సెప్టెంబర్ 3 (నమస్తే తెలంగాణ) : 2024-25 విద్యా సంవత్సరానికి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఎం.జయపాల్ రెడ్డి తెలిపారు. పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలకు (ఫ్రెష్, రెన్యూవల్) ఆన్‌లైన్‌లో దరఖాస్తు నమోదు చేసుకునేందుకు బుధవారం నుంచి డిసెంబర్ 31వరకు గడువు ఉందని పేర్కొన్నారు. కళాశాల యాజమాన్యాలు విద్యార్థుల ఉపకారవేతనాల నమోదు ప్రక్రియ 100 శాతం జరిగేలా తగిన చర్యలు చేపట్టాలని కోరారు. విద్యార్థుల బ్యాంక్ అకౌంట్ వివరాలు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. ఉపకార వేతనాల నమోదు ప్రక్రియ కోసం ఈ-పాస్ వెబ్ సైట్ http://telanganaepass.cgg.gov.in లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

# గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు

ఆలేరురూరల్,సెప్టెంబర్3 : ఉన్నత విద్యాశాఖ కమిషనర్ ఆదేశానుసారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆలేరులో తెలుగు, ఇంగ్లిష్, ఫిజిక్స్ సబ్జెక్టులకు 2024-25 విద్యా సంవత్సరానికిగానూ గెస్ట్ లెక్చరర్లుగా పని చేయడానికి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాజారాంనాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్హత సంబంధిత సబ్జెక్టులలో 55శాతం ఉత్తీర్ణతతో పీజీ, ఎస్సీ, ఎస్టీలకు 50శాతం ఉత్తీర్ణత కలిగి ఉండాలని, నెట్, సెట్ కలిగిన వారికి ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. దరఖాస్తులు సెప్టెంబర్5వరకు కళాశాలలో సమర్పించాలని తెలిపారు.

### రామన్నపేట డిగ్రీ కళాశాలలో

రామన్నపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రాహత్‌ఖానం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్-1, తెలుగు-1, పొలిటికల్ సైన్స్-1, పబ్లిక్ అడ్మిస్ట్రేషన్-1, కామర్స్-1 ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 6లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.


# కరెంట్ కనెక్షన్ ఇవ్వాలంటే డబ్బులివ్వాల్సిందే..!

- **పెద్దకందుకూర్ లైన్‌మెన్ రామిరెడ్డి డిమాండ్**
- **బాధితుడితో ఫోన్ సంభాషణ ఆడియో రికార్డు**
- **ఏఈకి ఫిర్యాదు చేసిన బాధితుడు గోపి**

యాదగిరిగుట్ట, సెప్టెంబర్3 : 'ఇంటికి సరఫరా అయ్యే వైర్ తెగిపోతే తిరిగి కనెక్షన్ ఇవ్వాలంటే డబ్బులివ్వాల్సిందే.. మీ ఇంటి అవసరానికి రావాల్సిన విద్యుత్ వైర్ తెగితే పునరుద్ధరించే పని పబ్లిక్ పని కాదు, సరే నీ ఇష్టం కనెక్షన్ ఇచ్చిన వ్యక్తి ఏదో అడిగితే వందో, రెండు వందలో ఇవ్వాలిగానీ ఎందుకింత పంచాయితీ' అని పెద్దకందుకూర్ లైన్‌మెన్‌తో ఆ గ్రామానికి చెందిన నమిలె గోపి మాట్లాడిన ఫోన్ సంభాషణ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. 'ప్రైవేట్ వ్యక్తయినా, ఏ ఇతర వ్యక్తయినా పనిచేయిస్తా నా ఇష్టం ఏం చేస్తావో చేసుకో' అని మాట్లాడిన మాటలు హల్‌చల్‌గా మారాయి. ఈ ఘటన ఆదివారం చోటు చేసుకోగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. వర్షాల కారణంగా గత శనివారం యాదగిరి గుట్ట మండలంలోని పెద్దకందుకూరు గ్రామానికి చెందిన నమిలె గోపి ఇంటికి రావాల్సిన విద్యుత్ వైర్ కరెంట్ స్తంభం వద్ద తెగిపోయింది. 24 గంటల గడిచినా విద్యుత్ అధికారులు రాకపోవడంతో స్థానిక లైన్‌మెన్ రామిరెడ్డికి ఫిర్యాదు చేశారు. ఆదివారం మధ్యాహ్నం లైన్‌మెన్ ప్రైవేట్ వ్యక్తితో విద్యుత్ స్తంభానికి కరెంట్ వైర్‌ను పునరుద్ధరించారు. వెంటనే తనకు రూ. 500 డబ్బులివ్వాలని ప్రైవేట్ వ్యక్తి కోరగా తమ లైన్‌మెన్‌తో మాట్లాడుతానని, కరెంట్ వైర్ తెగిపోతే డబ్బులెందుకు ఇవ్వాలని బాధితుడు గోపి లైన్‌మెన్ రామిరెడ్డితో ఫోన్‌లో ప్రశ్నించాడు. దీంతో రెచ్చిపోయిన లైన్‌మెన్ రామిరెడ్డి నిర్లక్ష్యంగా సమాధానమిచ్చాడని గోపి తెలిపాడు. లైన్‌మెన్‌పై చర్యలు తీసుకోవాలని ఏఈ సురేంద్రనాయుడికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు చెప్పాడు. ఈ విషయంపై ఏఈ సురేంద్రనాయుడి స్పందించారు. తనకు ఫిర్యాదు అందిన వెంటనే లైన్‌మెన్ రామిరెడ్డికి వివరణ కోరుతూ మెమో జారీ చేశామని, డీఈఈ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.

# ఎట్టకేలకు త్రిఫ్ట్ స్కీమ్ నిధులు విడుదల

- **చేనేత గ్రూపులకు చెక్కుల అందజేత**
- **పొదుపు పథకం మళ్లీ కొనసాగేనా..?**



## 11 నెలలకుగానూ రూ. 17 కోట్లు రిలీజ్

యాదాద్రి భువనగిరి, సెప్టెంబర్ 3 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు చేనేత కార్మికులపై కరుణ చూపించింది. పొదుపు పథకానికి సంబంధించి 11 నెలలుగా బకాయి పడిన నిధులను విడుదల చేసింది. ఈ మేరకు జిల్లాకు 17 కోట్లు రిలీజ్ చేసింది. ఆయా సొమ్మును చేనేత గ్రూపులకు అధికారులు అందజేస్తున్నారు.

నేతన్నలకు సామాజిక భద్రత కల్పించడం కోసం నాడు మాజీ సీఎం కేసీఆర్ చేనేత చేయూత పథకాన్ని తీసుకొచ్చారు. నేత కార్మికుల నెలసరి చేనేత ఆదాయంలో ఎనిమిది శాతం ఆర్డీ1లో జమ చేసిన తర్వాత.. రాష్ట్ర ప్రభుత్వం ఆర్డీ2లో 15శాతాన్ని నేరుగా జమ చేయాలి. ఆ మొత్తం నగదు వడ్డీతో సహ మూడేండ్ల తర్వాత కార్మికులకు అందుతుంది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక డబ్బులు జమ చేయడమే మరిచిపోయింది. సెప్టెంబర్ నుంచి 11 నెలలుగా డబ్బులు చెల్లించకపోవడంతో బకాయిలు పేరుకుపోయాయి. కాగా ప్రస్తుత 2021-2024 సంవత్సరానికి ఆగస్టు 31న స్కీమ్ గడువు ముగిసింది. ఈ నేపథ్యంలో తప్పనిసరి పరిస్థితుల్లో ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. మరోవైపు పొదుపు పథకం కోసం కొనసాగింపుపై ప్రభుత్వం ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. పథకం ఉంటుందా..? కొనసాగుతతుందా..? అనేది ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేనేత కార్మికులకు సంబంధించిన పథకాలకు ఒక్కొక్కటిగా పాతర వేస్తున్నది. నేతన్నల కోసం బీఆర్ఎస్ సర్కారు తీసుకొచ్చిన చేనేత మిత్ర పథకానికి మంగళం పాడింది. నేత కుటుంబానికి నెలకు రూ.3వేలు చెల్లించకుండా అటకెక్కించింది. గతంలో చేనేత మిత్ర పథకం కింద ప్రభుత్వం నూలు, రసాయనాలు, ముడి సరుకులకు సబ్సిడీ ఇచ్చేది. నూలు, సిల్క్ , ఉన్ని, డై, రసాయనాల కొనుగోలుపై 40శాతం సబ్సిడీ కల్పించేది. అయితే సబ్సిడీ పొందడం నేతన్నలకు ఇబ్బందిగా మారింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని బీఆర్ఎస్ ప్రభుత్వం అర్హులైన నేతన్నలకు నెలకు రూ.30వేల సాయం అందించాలని నిర్ణయంచింది. కార్మికుల కుటుంబాలకే నేరుగా డబ్బులు జమ చేసింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఒక్క పైసా కూడా చెల్లించలేదు. పథకాన్ని బంద్ చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

# బూర్గుపల్లిలో తాగునీటి కష్టాలు

- **పదిహేను రోజుల నుంచి సరాఫరా బంద్**
- **నీటి కోసం పొలం బాట పడుతున్న మహిళలు**
- **ఖాళీ బిందెలతో రోడ్డెక్కి నిరసన**



బూర్గుపల్లిలో ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు, గ్రామస్తులు

రాజాపేట, సెప్టెంబర్ 3 : బిందెడు నీటి కోసం మహిళలు, ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. తాగునీటి కోసం ఎక్కడో దూరాన ఉన్న పంట పొలాల బాటపడుతున్నారు. దాహార్తీ తీర్చండి సారో అని విన్నవించుకుంటున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజాపేట మండలంలోని బూర్గుపల్లిలో116 నివాస గృహలు, 554 మంది జనాభా కల్గి ఉన్న పల్లెకు గత పదిహేను రోజులుగా తాగునీటి కోసం నానా తంటాలు పడుతున్నారు. గ్రామానికి తాగునీరు అందించేందుకు పుష్కలంగా నీళ్ల బోర్లు ఉన్నప్పటికీ లక్షలు వెచ్చించి వేసిన పైపులైన్ కాంట్రాక్టర్ పూర్తి మరమ్మతులు చేపట్టకుండా నిర్లక్ష్యంగా వదిలేశారు. అలాగే పదిహేను రోజుల నుంచి మిషన్ భగీరథ నీటి సరఫరా సైతం నిలిచిపోయింది. దాంతో గ్రామస్తులు తాగునీటి కోసం ఇక్కట్లు పడుతున్నారు. వర్షాకాలంలోనే పరిస్థితి ఇలా ఉంటే మండు వేసవిలో ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తాగునీటి కోసం గ్రామ మహిళలు, ప్రజలు ఖాళీ బిందెలతో రోడ్డెక్కి నిరసన తెలుపడమే దీనికి నిదర్శనం. పంచాయతీ కార్యదర్శి జ్యోతిని వివరణ కోరగా గత మూడు రోజుల నుంచి మిషన్ భగీరథ నీళ్లు రాక ఇబ్బందులు పడడం వాస్తవమేనని, తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రెండు రోజుల్లో పైపులైన్ పూర్తి స్థాయిలో మరమ్మతు పనులు చేపట్టి తాగునీటి సమస్య పరిష్కరిస్తామని చెప్పారు.

### నీటి శాంపిల్ సేకరణ

బూర్గుపల్లిలో ఇటీవల మిషన్ భగీరథ నీరు మురికిగా వచ్చినందున మంగళవారం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కరుణాకర్ గ్రామాన్ని సందర్శించారు. ఇంటింటికీ తిరిగి నీటి సమస్యను అడిగి తెలుసుకున్నారు. శాంపిల్ సేకరించి ల్యాబ్‌కు పంపించినట్లు తెలిపారు. ఆయన వెంట ఎంపీఓ కిషన్, పంచాయతీ కార్యదర్శి జ్యోతి, మాజీ సర్పంచ్ రేకులపల్లి మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు.

### ప్రత్యేకాధికారులు పట్టించుకోవడం లేదు



గ్రామంలో ప్రత్యేకాధికారుల పాలన వచ్చినప్పటి నుంచి గ్రామంలో తాగునీటితో పాటు పారిశుధ్య పనులు పట్టించుకోవటం లేదు. గ్రామానికి పుష్కలంగా నీరు అందించే బోరు ఉన్నా పైపులైన్ మరమ్మతులు చేపట్టడంలో అధికారులు, కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం వహిస్తున్నారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు.

**- రేకులపల్లి, మహిపాల్‌రెడ్డి, బూర్గుపల్లి మాజీ సర్పంచ్**

### నీళ్ల కోసం రోజూ పడిగాపులు



మూడు నెలల నుంచి బిందెడు నీళ్ల కోసం నానా తంటాలు పడుతున్నాం. దూరంగా ఉన్న పంట పొలాల్లోకి వెళ్లి నీళ్లు తెచ్చుకుంటున్నాం. దినంలో ఎప్పుడొస్తాయో తెలియక రాత్రింబవళ్లు నీళ్ల కోసం పనులు మానుకొని పడిగాపులు కాస్తున్నాం. గ్రామానికి వచ్చే సార్లను అడిగితే మాకు సంబంధం లేదు అంటుండ్రు. మా నీటి గోస ఎవరి చెప్పుకోవాలో సమజైతలేదు. దండ పెట్టి అడుగుతున్నా పెద్దసార్లు జర మా ఊరి నీటి సమస్య పరిష్కరించడయ్యా.

**-సుంకరి అనసూర్య, బూర్గుపల్లి**